క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో డిప్యూటీ కమిషనర్



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి అమ్మవారిని గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత వారు గణపతి స్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలతో వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం



పొదలకూరు : మండలంలోని బిరదవోలు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బడుగు రామయ్య ఇటీవల కల్లుగీస్తూ చెట్టుపై నుంచి పడడంతో వెన్నుపూస దెబ్బతింది. దీంతో గౌడ్ సేవాసమితి ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ శనివారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కోసూరు గోవిందయ్యగౌడ్ ఆశయసాధనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరధరామయ్యగౌడ్, ఇంద్రసేనగౌడ్, ట్రస్ట్ జిల్లా సభ్యుడు వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు తాళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రెడ్డిపాళేనికి చెందిన వాడకుప్ప కృష్ణయ్య, వాడకుప్ప మౌనిక, అంబటి శాంతమ్మలు ఇటీవల బోగోలులో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలోని శేషాద్రినగర్‌లో ఉంటున్న కృష్ణయ్య సతీమణి పద్మమ్మను శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి ఉన్నారు.

కామాక్షితాయి ఆలయ ఈఓగా గిరికృష్ణ



ఈఓలను సన్మానిస్తున్న చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ ఈఓగా వి.గిరికృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు నెల్లూరులోని రంగనాయకుల దేవస్థానం ఈఓగా బదిలీపై వెళ్లారు. కాగా ఇద్దరు ఈఓలను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు సన్మానించారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు ఇంజినీర్లు శనివారం తెలిపారు. 1వ యూనిట్లో 420, 2వ యూనిట్లో 420 మెగావాట్ల చొప్పున విద్యుదుత్పత్తి జరుగుతోందని చెప్పారు. సాంకేతిక కారణాలతో 3వ యూనిట్లో ఉత్పత్తి జరగడం లేదని తెలిపారు.

కాకాణి వెంటే ఉంటా

పొదలకూరు : ఊపిరి ఉన్నంత వరకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంటే ఉంటానని మండల సచివాలయాల కన్వీనర్, విరువూరు మాజీ సర్పంచ్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. విరువూరులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తానేదో పార్టీ మారుతున్నట్లు కొందరు చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. ఆనం రామనారాయణరెడ్డితో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నా తన దారి వేరు ఆయన దారి వేరన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి తనకు సోదర సమానులని, తమ పంచాయతీ అభివృద్ధి ఆయన వల్లనే జరిగిందన్నారు.

బాబు బాగోతం బహిర్గతం

- అధినేత అవినీతిపై కార్యకర్తలు మౌనం
- తప్పును అంగీకరిస్తున్న పచ్చనేతలు

కోవూరు/పొదలకూరు/వెంకటాచలం : టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి బాగోతం అందరి ముందు బహిర్గతమైంది. ప్రజల సొమ్మును దోచుకోవడమే పరమావధిగా ఆయన హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు తెరలేపి నిధులను పక్కదారి పట్టించడంతో సీఐడీ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. దీంతో చంద్రబాబు అసలు రూపం బట్టబయలైందని పలువురు పేర్కొన్నారు. కాగా అరెస్ట్‌పై కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోని తెలుగు తమ్ముళ్లలో కనీస స్పందన కరువైంది. సోషల్ మీడియా వేదికగా కూడా స్పందించేందుకు ఇష్ట పడలేదు. కొన్నిచోట్ల ఉనికి కోసం నిరసనలు తెలిపేందుకు ప్రయత్నించినా పోలీసులు వారిని కట్టడి చేశారు.

నామమాత్రంగా ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐదుగురు టీడీపీ నేతలు నామమాత్రంగా ఆందోళన చేపట్టారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టీడీపీ నేతల తీరుపై ప్రజలు అసహ్యించుకున్నారు. కాగా సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్‌లు ఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ నేతలను అక్కడి పంపేశారు.

చంద్రబాబు అయితే వదిలేయాలా



చంద్రబాబు నాయుడు తప్పు చేస్తే వదిలివేయాలా? ఇదెక్కడి న్యాయం. టీడీపీ ఆందోళనలు అర్థరహితం. ప్రజల సొమ్మును దోచుకుని తింటుంటే చూస్తూ ఊరుకుని ఉండాలని టీడీపీ సంకేతాలు పంపుతున్నట్లుగా ఉంది. ఎంతటి వారైనా చట్టం ముందు తలవంచక తప్పదు. బాబుకు పవన్‌కల్యాణ్ వంతపాడడం అర్థరహితం.

– వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, మరుపూరు.

దేశంలోనే హేయమైన ఆర్థిక నేరం



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : చంద్రబాబు ప్రభుత్వంలోనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ పురుడు పోసుకొందని, ఇది భారతదేశంలో అత్యంత హేయమైన ఆర్థిక నేరమని డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. కోవూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం 2015లో ప్రారంభమైందన్నారు. ఈ స్కామ్‌పై 2021లోనే సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా సీఐడీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ జరుపుతున్నారని, ఇది పూర్తి పారదర్శకంగా, చట్టపరంగా జరిగిందన్నారు. దర్యాప్తులో బలమైన ఆధారాలు వెలుగులోకి వచ్చాయని, అందువల్లే చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఆయన కన్నా ముందు ఎనిమిది మందిని విచారించారని, అప్పుడు లేని ఆందోళనలు ఇప్పుడెందుకు వచ్చాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు చిరంజీవి, ప్రసాద్, విజయసేనారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు



చట్టానికి ఎవరూ అతీతులు కారు. సమాన్యుడైనా, ఉన్నవాడైనా చట్టం దృష్టిలో అందరూ సమానులే. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు పాల్పడినందువల్లనే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆధారాలను పరిశీలించి న్యాయస్థానం నిగ్గుతేల్చుతుంది. చంద్రబాబును అరెస్ట్ చేయడం ముమ్మాటికే సమ్మతమే.

– పెదమల్లు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, పొదలకూరు

చేసిన పాపం ఊరికే పోదు



రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుని ఇప్పుడు ఏమీ తెలియని అమాయకుడిగా నటించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ప్రజాధనాన్ని అప్పనంగా దోచుకుని, పేదలను ఇబ్బందులకు గురి చేసినందుకు ప్రతిఫలంగా శిక్ష అనుభవించాల్సిందే. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి ఉంటుంది.

– సి.పార్వతి, ఎంపీపీ, కోవూరు

అరెస్ట్ సబబే



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై సీఐడీ విచారణ పూర్తి పారదర్శకంగా జరిగింది. శిక్షణ పేరుతో రాష్ట్ర యువత భవిష్యత్తును తాకట్టుపెట్టి ప్రజాధనం అడ్డగోలుగా దోచుకున్న చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదు. చంద్రబాబు అరెస్ట్‌లో ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదు. చట్టం ముందు అందరూ సమానులే.

– మావులూరు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇందుకూరుపేట మండల కన్వీనర్

బాబు ముమ్మాటికి దోషే



స్కిల్ స్కామ్‌లో సీఐడీ స్పష్టమైన ఆధారాలను చూపుతున్నందున్న చంద్రబాబు ముమ్మాటికీ దోషే. షెల్ కంపెనీలను సృష్టించి ప్రజల సొమ్ము దోచుకుంటుంటే చట్టం చూస్తూ ఊరుకోదు. ప్రజాస్వామ్యంలో ఉన్నత పదవుల్లో ఉన్న వారు ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా ఉండాలి.

– తెనాలి నిర్మలమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు, పొదలకూరు

కోర్టులో నిరూపించుకోవాలి



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిధులు పక్కదారి పట్టడం చంద్రబాబు సూచనలతోనే జరిగింది. దీనిపై చంద్రబాబును ప్రశ్నించాల్సి ఉంది. అందుకే న్యాయపరంగా అన్ని చర్యలు తీసుకుని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. చంద్రబాబు తన నిజాయితీని కోర్టులో నిరూపించుకోవాలి.

– పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్

సూత్రధారి బాబే



చంద్రబాబు దర్శకత్వంలోనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ జరిగింది. అప్పటి ఫైల్స్‌ను కావాలనే అదృశ్యం చేశారు. నైపుణ్యాభివృద్ధి పేరుతో యువతను మోసం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో చంద్రబాబే సూత్రధారి.

– పూండ్ల అచ్యుత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

పక్కా ఆధారాలతోనే అరెస్ట్



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో పక్కా అధారాలతోనే చంద్రబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. బాబు అరెస్ట్‌ను టీడీపీ రాజకీయం చేస్తూ, ప్రజలను రెచ్చగొట్టే కుట్రలు చేయడం సరికాదు. ఈ కేసు రాత్రికి రాత్రి జరిగింది కారు. రెండేళ్ల క్రితమే ఎఫ్ఐఆర్ నమోదైందనే విషయం ప్రజలకు తెలుసు. బాబు తన నిజాయతీని కోర్టులో తేల్చుకోవాలే తప్ప, టీడీపీ నేతలను రెచ్చగొట్టడం మంచి పద్ధతి కాదు.

– మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వ పాలన ఉందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని విరువూరు గ్రామం, ఇస్కపాళెం ఎస్సీ కాలనీలో శ్రీరామాలయానికి శంకుస్థాపన, జొన్నమిట్ట ఎస్టీకాలనీలో సీతారాముల దేవస్థానం విగ్రహప్రతిష్ట, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ ప్రారంభోత్సవాల్లో మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మాజీ సర్పంచ్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన సభలో 230 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాల పట్టాలను కాకాణి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో రూ.2,750 పింఛన్ అందించేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేనన్నారు. విరువూరు బైపాస్ రోడ్డుకు నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. పేదలకు నివేశన స్థలాలు చాలకుంటే ప్రైవేటు స్థలం కొనుగోలు చేసి అయినా అందజేస్తామన్నారు. మాజీ సర్పంచ్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి అభ్యర్థన మేరకు రైతులు ఇబ్బందులు పడకుండా రూ.1.10 కోట్లతో కనుపూరు కాలువపై సూపర్ పాసేజ్(దోని) నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో మంత్రిగా సోమిరెడ్డి కనుపూరు కాలువ పూడిక తొలగింపులో రూ.30 కోట్ల అవినీతికి ప్రయత్నిస్తే తాను రైతులతో కలిసి అడ్డుకుని పనులు చేయించినట్లు వెల్లడించారు. తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, రమణారెడ్డి, ఎంపీటీసీ ఎం.విజయకుమార్, మాజీ ఎంపీటీసీ రాజగోపాల్‌రెడ్డి, పార్టీ నేతలు జి.దయాకర్‌రెడ్డి, దశకంఠాద్రిశర్మ, జి.మధుసూదన్‌రెడ్డి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులు

కొడవలూరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న మండలంలోని ఇద్దరు టీచర్లను స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం సన్మానించారు. కొడవలూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని టి.లక్ష్మీభవాని, నార్తురాజుపాళెం సీబీఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఓ.శ్రీలక్ష్మి ఈనెల 5న జరిగిన గురుపూజోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో అవార్డులు అందుకున్నారు. దీంతో వీరిని ఎంఈఓ కార్యాలయ సిబ్బంది సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయినులకు రాష్ట్ర అవార్డులు దక్కడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, ఉపాధ్యాయుడు రాజశేఖర్‌శర్మ, సీఆర్పీలు ఎం.దయాకర్, పెంచలరావు, శ్రీహరిబాబు, కార్యాలయ సిబ్బంది విజయమ్మ, మస్తాన్ పాల్గొన్నారు.

మార్పు చేర్పులు పక్కాగా జరగాలి

- స్పెషల్ కలెక్టర్ ఓబులేసు



బీఎల్‌ఓలతో సమీక్షిస్తున్న స్పెషల్ కలెక్టర్

మనుబోలు : ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులను పక్కాగా, త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు బీఎల్‌ఓలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఇష్టారాజ్యంగా చేస్తే కుదరదన్నారు. ఈనెల 16వ తేదీలోపు ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులను పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో మనుబోలు మండలం వెనుకబడి ఉందన్నారు. ఇకనైనా బీఎల్వోలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టకు సిద్ధమైన కోదండరామస్వామి ఆలయం.. ప్రతిష్టకు సిద్ధం చేసిన విగ్రహాలు

ముత్తుకూరు : మండలంలోని దువ్వూరువారిపాళెంలో ఏర్పాటైన శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం విగ్రహాల ప్రతిష్టకు సిద్ధం చేశారు. నూతన విగ్రహ విమాన శిఖర పునఃప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవానికి శనివారం నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. విగ్రహాల ప్రతిష్ట అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

మంత్రి కాకాణి రాక

విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పాల్గొంటారని స్థానిక నేత దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మహా కుంభాభిషేక ఉత్సవంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు.

మెగా లోక్‌అదాలత్ విజయవంతం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

కోవూరు : మండల కేంద్రంలోని కోర్టు సముదాయంలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్ విజయవంతమైందని, ఇందులో 150 క్రిమినల్ కేసులు, 2,010 ఇతర కేసులు రాజీపడినట్లు న్యాయమూర్తులు తెలిపారు. క్షణికావేశంలో చేసే పొరపాట్లను సరిదిద్దుకునేందుకు లోక్‌అదాలత్ ఎంతో ఉపయోగకరమన్నారు. అలాడే రాజీపడిన కేసులకు గానూ సెటిల్‌మెంట్గైన రూ.29.50 లక్షలను జమ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, సీనియర్ సివిల్ జడ్జి జె.కాత్యాయని, కమిటీ సభ్యులు రాంబాబు, చెన్నయ్య, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణం పూర్తి

- నేడు ప్రారంభం

మనుబోలు : మండలంలోని మడమనూరులో గ్రామస్తుల కోరిక మేరకు శ్రీసేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో నిర్మించిన రచ్చబండ ప్రారంభానికి సిద్ధమైంది. మడమనూరు గ్రామంలో తమకు రచ్చబండ కావాలని గ్రామస్తులు ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డిని అడగడంతో ఆయన రూ.5 లక్షలతో రచ్చబండను నిర్మించాడు. ఆదివారం సాయంత్రం పుర ప్రముఖుల సమక్షంలో రచ్చబండను ప్రారంభించనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా భరతనాట్యంలో గ్రామానికి వన్నె తెచ్చిన చిన్నారులు కందల సుస్మిత, చేవూరు పావని, పృథ్వీపౌర్ణమిలకు రచ్చబండ వేదికగా సన్మానం చేయనున్నట్లు తెలియజేశారు.

చిన్నారి లక్షితకు మరో రూ.5 లక్షల పరిహారం

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళేనికి చెందిన చిన్నారి లక్షిత గత నెలలో తిరుమల దర్శనానికి వెళ్తూ చిరుత దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా తిరుమల తిరుపతి దేవస్థానం, అటవీ శాఖ అధికారులు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కలిపి మొత్తం రూ.12 లక్షలను చిన్నారి కుటుంబ సభ్యులకు ఇటీవల అందజేశారు. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మరో రూ.5 లక్షల సాయం అందించాలని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోరి ఉన్నారు. ఆయన విన్నపం మేరకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు.

ఇక్కడి విద్యావిధానంతో ఉజ్వల భవిత

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వివరించిన విద్యార్థిని



ప్రవీణ్‌ప్రకాశ్‌తో విద్యార్థిని కార్తీక

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని నాగమాంబపురం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని జీవీ కార్తీక రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్‌ను కలిసింది. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో శనివారం జరిగిన కెరీర్ గైడెన్స్ ప్రవీణ్‌ప్రకాశ్ విచ్చేయగా, కార్తీక వెళ్లి ఆయనతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మంచి విద్యావిధానాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా ట్యాబ్‌ల పంపిణీ, సీబీఎస్సీ సిలబస్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. దీంతో కార్తీకను ప్రవీణ్‌ప్రకాశ్ అభినందించారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.120 కోట్ల మంజూరు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పొదలకూరు పట్టణంలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు పట్టణంలో సిమెంటురోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి కాకాణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఒక్క ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారానే రూ.120 కోట్లు మంజూరు చేయించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పొదలకూరు పట్టణంలో రెండున్నర దశాబ్దాలకు పూర్వం నిర్మించిన సీసీరోడ్డు దెబ్బతినడం వల్ల వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా తిరిగి సీసీరోడ్డు విస్తరణ పనులను రూ.3 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల రహదారులకు రూ.87.50 కోట్లు, బ్రిడ్జి నిర్మాణాలకు రూ.22 కోట్లు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. అదనంగా మరో రూ.11 కోట్లను నియోజకవర్గంలో రోడ్ల ఆధునికీకరణకు మంజూరు చేయించినట్లు తెలిపారు. మొత్తంగా చూసుకుంటే రూ.120 కోట్లు ఆర్‌అండ్‌బీ ద్వారా రహదారుల నిర్మాణానికి ఖర్చు చేస్తున్నట్లు తెలియజేశారు. ఇందులో పొదలకూరు–సోమశిల, పొదలకూరు–విరువూరు, మనుబోలు–పొదలకూరు ఆర్‌అంబీ రోడ్ల నిర్మాణానికి రూ.13.50 కోట్లు, వెంకటాచలం మండలం నెల్లూరు–అనికేపల్లి వయా గొలగమూడి, తిరుమలమ్మపాళెం రోడ్డు, నారాయణరెడ్డిపేట–టీపీగూడూరు, ఎస్‌పీఎస్ రోడ్డు కృష్ణపట్నం వయా పాలిచెర్లపాడు రోడ్లకు రూ.17.55 కోట్లు, నెల్లూరు–పొదలకూరు–సైదాపురం రోడ్డు, నెల్లూరు–కృష్ణపట్నం రోడ్డు, వెంకటాచలం–ముత్తుకూరు రోడ్లకు రూ.22.25 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. ముత్తుకూరు మండలం నక్కలకాలువ రోడ్డుకు రూ.10 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

పీఆర్‌రోడ్లకు రూ.59 కోట్లు

గ్రామీణ ప్రాంతాల రోడ్లకు సంబంధించి నియోజకవర్గానికి పంచాయతీరాజ్ నుంచి రూ.59 కోట్లు మంజూరు చేయించి రోడ్లు నిర్మిస్తున్నట్లు మంత్రి కాకాణి వెల్లడించారు. గతంలో సోమిరెడ్డి ఏషియన్ బ్యాంకు ద్వారా రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాలు వేసి వెళ్తే తాము రాష్ట్ర భాగస్వామ్యం కింద 25 శాతం నిధులను వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లను పూర్తి చేయించినట్లు తెలిపారు. మొగళ్లూరు, బిదరవోలు రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నామని, భోగసముద్రం రోడ్డు పనులను చేపడుతున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరగలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, సర్వేపల్లి ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిని అడ్డుకోవడం సోమిరెడ్డి తాతల వల్ల కూడా కాదన్నారు. మంత్రి వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ, డీఈ సురేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు జి.లక్ష్మీకల్యాణి, రావుల దశరధరామయ్యగౌడ్, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పెదమల్లు రమణారెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎం.శేఖర్‌బాబు, ఎస్‌కే అంజాద్, డి.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పులకించిన కోడూరు సాగరతీరం



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

- ముగిసిన వేళాంగణి మహోత్సవాలు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు సాగరతీరం వేళాంగణిమాత భక్తుల పుణ్యస్నానాలతో శనివారం పులకించిపోయింది. ఏసు క్రీస్తు తల్లి వేళాంగణిమాత జన్మదిన ఆరాధన మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ క్రమంలో అమ్మవారి భక్తులు పుణ్యక్షేత్రం ఆవరణలో శుక్రవారం రాత్రి జాగరణ చేశారు. శనివారం వేకువజాము నుంచి స్థానికంగా ఉన్న కోడూరు సాగరతీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో వేళాంగణి చర్చి భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎస్సై జంపానికుమార్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.